'గృహజ్యోతి' అర్హుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం



అర్హులైన కుటుంబాల వివరాలను సేకరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

నల్లకుంట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే ప్రతి కుటుంబానికి ఈ పథకాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. కాగా ఈ మేరకు అర్హులైన కుటుంబాల ఎంపిక కోసం విద్యుత్ శాఖ సర్వే చేపట్టింది. దీనిలో భాగంగానే గత రెండ్రోజులుగా నల్లకుంట డివిజన్‌లో విద్యుత్ శాఖ ఇంటింటి సర్వే చేపట్టింది. శనివారం డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లో విద్యుత్‌శాఖ అధికారులు అర్హుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేశారు. రేషన్‌కార్డు జిరాక్, ఇంటి చిరునామా, విద్యుత్ మీటర్ నంబరు, మొబైల్ నంబర్ నమోదు చేయించుకునేందుకు పెద్దఎత్తున స్థానికులు తరలివచ్చారు. పూర్తి వివరాలు సేకరించిన తర్వాత 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియదారులను గుర్తించి, అర్హులైన ప్రతి కుటుంబానికి గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తారని సమాచారం. రత్నానగర్, సత్యానగర్, గాంధీనగర్ లంకబస్తీ, గోల్నాక కూరగాయల మార్కెట్, ఖర్బాన లేన్, ఇందిరానగర్, చైతన్యనగర్, తిలక్‌నగర్ గాంధీ బొమ్మ లేన్, నర్సింహాబస్తీ, నంజయ్‌గాంధీనగర్ బస్తీలలో దాదాపు 90 శాతం మంది పేదలే నివాసముంటున్నారు. దీన్ని బట్టి ప్రతి కుటుంబం గృహజ్యోతి పథకానికి అర్హులనే విషయం స్పష్టమవుతోంది. విద్యుత్‌శాఖ ఏఈ బాలరాజు, అధికారులు బాలక్రిష్ణ, హరిత, నిరంజన్, సురేందర్, లైన్‌మెన్ శంకర్, బస్తీ అధ్యక్షుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఉత్సాహంగా పుస్తక ప్రదర్శన



గద్దర్ జీవకణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కవాడిగూడ: సవాళ్లను అధిగమించే శక్తివంతమైన నవతరం సృష్టికి బాల సాహిత్యమే మూలమని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ అన్నారు. శనివారం హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో బాలవికాస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు, రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వికాసంలోనే రాష్ట్ర, దేశ ఆరోగ్యకర, భవితవ్యం మిళితమై ఉందన్నారు. స్మార్ట్ ఫోన్‌లే రిసోర్స్ సెంటర్లుగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక మాధ్యమాలను బాల సాహిత్య వ్యాప్తికి సాధనంగా వినియోగించుకోవాలన్నారు. నెహ్రూ, బాల ఇందిరా గాంధీలు మధ్య ఉత్తరాలలో నడిచిన సాహిత్య సామాజిక చర్చలే, దివంగత ప్రధాని ఇందిరాగాం. దీని ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొనే నేతగా తీర్చిదిద్దాయన్నారు. నూతన ఆవిష్కరణల సృష్టికర్తలుగా నవతరం ఎదగడానికి బాల సాహిత్యం బలమైన బీజమేస్తుందని వివరించారు. బుక్‌ఫేయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, చొక్కాపు వెంకట రమణ, సీఏ ప్రసాద్, వీఆర్ శర్మ, బుక్ ఫెయిర్ సెక్రటరీ ఆర్ వాసు, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, భూపతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- చొల్లేటి కృష్ణమాచార్యులు రచించిన ఆచార్య నాగార్జున విశ్వబ్రాహ్మ చారిత్రాత్మక నవలను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్, జూలూరి గౌరీశంకర్ ఆవిష్కరించారు.

గద్దర్ యాదిలో పలువురు వక్తలు..

కవాడిగూడ: మహోత్తర సాంస్కృతిక ఉద్యమానికి గద్దరే వారసుడని, సాంస్కృతిక చరిత్ర సృష్టించిన మహాయోధుడని పలువరు వక్తలు పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 36వ జాతీయ పుస్తక ప్రదర్శనలో ప్రముఖ రచయిత డాక్టర్ పసునూరి రవీందర్ అధ్యక్షతన గద్దర్ యాదిలో పాటతో ఓ సాయంకాలం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాటకు జీవలకణం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రజాగాయకులు గోరేటి వెంకన్న, విమలక్క, జయరాజు, ప్రొఫెసర్ కాశీం, గంటా చక్రపాణి, అల్లం నారాయణ, ఏపూరి సోమన్న హాజరయ్యారు. తెలంగాణలో సాంస్కృతిక శాఖలో పనిచేస్తున్న 500ల మంది కళాకారులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కవులు డాక్టర్ మాస్టార్‌జీ, యశ్‌పాల్, సురేందర్, యోచన, మానుకోట ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షులు చంద్రమోహన్ తదితరులున్నారు.

రైతు జీవితమే మల్లారెడ్డి సాహిత్యానికి ఇతి వృత్తం..

కవాడిగూడ: వ్యవసాయ నేపథ్యం రైతు జీవితం గ్రామీణ జీవన సాంస్కృతి మల్లారెడ్డి సాహిత్యానికి ఇతివృత్తాలని ప్రముఖ కవి ఏనుగు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బుక్‌ఫేయిర్‌లో పాలపిట్ట బుక్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో గులాబీల మల్లారెడ్డికి సంబంధించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

ప్రైవేటీకరణతో ప్రభుత్వరంగ బ్యాంకులు నిర్వీర్యం

అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు శంకర్



కాచిగూడ: ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.శంకర్ ఆరోపించారు. శనివారం కాచిగూడలో యూనియన్‌బ్యాంకు అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర ప్రథమ సంయుక్త ప్రాంతీయ ద్వివార్షిక మహాసభలు ఏఐయూబీఈఏ కార్యనిర్వాహక అధ్యక్షులు రవీంద్రనాథ్ అధ్యక్షతన శనివారం కాచిగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యంత స్థిరత్వం ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేసేందుకు కేంద్రం అనేక ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. వంద శాతం రజా పెట్టుబడితో లాభాల్లో నడుస్తున్న ఎల్ఐసీ ప్రైవేటీకరణకు పెట్టడం దీనితో పాటు ఎల్ఐసీ పెట్టుబడి పెట్టిన ఐడీబీఐ బ్యాంకును ప్రైవేటీకరించడం దారుణమన్నారు. ప్రభుత్వ బ్యాంకింగ్‌ను బలహీన పరిచేందుకు కేంద్రం బ్యాంకుల విలీన ప్రక్రియ చేపట్టిందన్నారు.

నష్టమే ఎక్కువ..

బ్యాంకుల విలీనంతో నష్టమే తప్పా.. లాభం లేదని, ఎస్‌బీఐతో ఐదు అసోసియేట్ బ్యాంకుల విలీనం తర్వాత దాదాపు 1000 శాఖలు మూతపడ్డాయన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడాలో దేనా బ్యాంకు, విజయా బ్యాంక్ విలీనంతో 800 శాఖలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల్లో ఇబ్బందులు..

ప్రత్యేకంగా గ్రామీణ భారతదేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ అందుబాటులోకి లేకుండా పోతుందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వల్ల కార్మికుల ఉద్యోగ భద్రత తుడిచిపెట్టుకుపోగా.. నిరుద్యోగం విపత్తు పెరిగిపోయిందన్నారు.

మధ్యతరగతికి భరోసాగా..

మధ్యతరగతి ఆర్థిక వ్యవస్థ ఆకాంక్షలకు భారతదేశంలో చురుకైన, సమర్థవంతమైన ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థ అవసరమన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయకుంటే దేశ ఆర్థికవ్యవస్థ మరింత దెబ్బతింటుందని హెచ్చరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ కె.భాస్కర్‌రావు, యూబీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ రవికుమార్, యూనియన్ నేతలు ఎస్.శ్రీనివాస్‌రావు, సమద్ ఖాన్, యువి రజనీకాంత్‌రావు, ఎం.అరుణ్‌కుమార్, సీఏ కళ్యాణ్‌వర్మ, బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి, కె.రాజగోపాల్, కె.రాజేందర్, మీనాక్షి, ఎస్.భార్గవి, ఆర్.సత్యం, ఎస్.సురేష్, సుప్రియ, షరా, రాజేష్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, సిరికొండ రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు

పీవీకి భారతరత్నపై హర్షం



రాంనగర్ గుండు చౌరస్తాలో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

ముషీరాబాద్: భారత మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల రూపశిల్పి పీవీ.నరసింహారావుకు భారతరత్న ఇవ్వడంపై బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. శనివారం సాయంత్రం రాంనగర్ గూండు చౌరస్తాలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పీవీ చేసిన సేవలను కొనియాడారు. డివిజన్ అధ్యక్షులు నరేష్, కౌడిన్య ప్రసాద్, వంశీ, సాయికృష్ణయాదవ్, శేషసాయి, బాబుసుబ్రహ్మణ్యం, గౌరీశంకర్, రాజు, విశ్వనాథ శాస్త్రి, జగదీశ్, రాజేష్, బాలరాజు, చంద్రశేఖర్ తదితరులున్నారు.

'బడ్జెట్‌లో దివ్యాంగులకు నిధులు కేటాయించలేదు'



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయమని 'డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్' జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన బాగ్‌లింగంపల్లిలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి రూ.2,75,891 కోట్ల బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లుగా ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. 2016లో హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం దివ్యాంగుల, సకలాంగుల సమాన స్థాయి బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఐదు శాతం ప్రకారం రూ.15 వేల కోట్లు కేటాయించాలని చెప్పారు. చేయూత పెన్షన్‌కు బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. డిసెంబర్ నుంచే పెంచిన ఆసరా పెన్షన్‌ను పంపిణీ చేస్తామని చెప్పి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలో 30 లక్షలకు పైగా ఉన్న దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని చెప్పడానికి ఈ బడ్జెట్‌యే సాక్షమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దివ్యాంగులకు రావాల్సిన న్యాయపరమైన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (60) డబీర్‌పుర – మలక్‌పేట రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై..

ముషీరాబాద్: రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌పై వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెదవి విరిచారు. వారి వారి అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి.

ఇది పసలేని బడ్జెట్..



మంత్రి భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌లో పసలేదు. మసిపూసి మారేడు కాయ చేయడం తప్పా.. మరోకటి కాదు. అన్ని రంగాలను బడ్జెట్‌లో విస్మరించారు. హైదరాబాద్ నగరాభివృద్ధిపై ఒక ప్లాన్ లేకపోవడం గమనించవచ్చు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ బడ్జెట్‌ను విమర్శించి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి తాను కూడా మాటల గారడితోనే సరిపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు.

– ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

విద్యా రంగాన్ని నిరాశ పరిచింది..



బడ్జెట్ కేటాయింపులో విద్యారంగం బలోపేతం కోసం ఆశించిన నిధులు కేటాయించకుండా కేవలం 7.75 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. యూనివర్సిటీల అభివృద్ధికి కేటాయించిన రూ.500 కోట్లు కనీస సౌకర్యాలకు కూడా సరిపోవు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల విషయం బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. హాస్టల్ విద్యార్థులకు మెస్‌చార్జీల పెంపు గత ప్రభుత్వం నోటి మాటకే సరిపెట్టగా.. తాజా ప్రభుత్వంలో కూడా మాటలతోనే సరిపెట్టేలా ఉంది.

– రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు

నగరాభివృద్ధిని విస్మరించారు..



ఎన్.గౌతమ్‌రావు

కాచిగూడ: శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నగరాభివృద్ధిని పూర్తిగా విస్మరించారని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు విమర్శించారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. భాగ్యనగరం నుంచి రాష్ట్రానికి అత్యధిక ఆదాయం సమకూరుతున్నప్పటికీ నగరానికి మాత్రం ప్రభుత్వం మొండిచేయి చూపెట్టిందన్నారు. పురపాలకశాఖకు రూ.11వేల కోట్లు మాత్రమే కేటాయించడం నగరంపై కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చినప్పటికీ వాటి అమలుకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని ఆరోపించారు.

టీవీ చానల్ న్యూస్ ప్రజెంటర్లకు పురస్కారాలు



సాక్షి న్యూస్ ప్రజెంటర్ రవళికి పురస్కారం అందజేస్తున్న రామలింగేశ్వరరావు, గ్రహీతలు

చిక్కడపల్లి: వివిధ టీవీ చానల్‌ల న్యూస్ ప్రజెంటర్లకు ఆరాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరావు ముఖ్యఅతిథిగా హాజరై పురస్కారాలు పంపిణీ చేశారు. సాక్షి న్యూస్ ప్రెజెంటర్ రవళితో పాటు జొన్నలగడ్డ సరోజ, ధనలక్ష్మీ, నవీన్ తదితరులు అవార్డులు అందుకున్నారు.

వ్యక్తిపై దాడిచేసిన నిందితుడికి 14 రోజుల జైలు

కాచిగూడ: ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన నిందితుడికి కోర్టు 14 రోజుల జైలుశిక్ష విధించిందని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ్ రాజు తెలిపారు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్ గఫార్ నింబోలి అడ్డలో ఫుట్‌పాత్‌పై టీ స్టాల్‌ను పెట్టి టీ విక్రయిస్తున్నాడు. శుక్రవారం కాచిగూడకు చెందిన ఆటో డ్రైవర్ సాయికుమార్ (32) తనకు డబ్బులు ఇవ్వాలని లేదంటే టీస్టాల్‌ను ఫుట్‌పాత్‌పై నుంచి తీసివేయాలని బెదిరించాడు. అతడు డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో చేతికున్న కడియంతో అతడిపై దాడిచేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా.. న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్షను ఖరారు చేస్తూ తీర్పు వెలువరించారన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన

కవాడిగూడ: సమాజంలో కుష్ఠువ్యాధిని అరికట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ, అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌ఓ నిర్మలా ప్రభావతి, పారామెడికల్ ఆఫీసర్ వనిత, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి వివిధ బస్తీ వాసులకు సూచించారు. శనివారం కవాడిగూడ డివిజన్ బీమామైదాన్ బస్తీదవాఖానాలో కుష్ఠువ్యాధి నిర్మూలనలో భాగంగా స్పర్శ్ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ రచనశ్రీ, అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ నిర్మలా ప్రభావతి, పారామెడికల్ ఆఫీసర్ వనిత డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, డీబీఆర్ మిల్ హెల్త్ సెంటర్ డాక్టర్ అవంతి హాజరై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. చర్మంపై తెల్లని, రాగి మచ్చలు కలిగి ఉండి స్పర్శలేనట్లయితే కుష్ఠు వ్యాధి అనుమానం కావచ్చని భావించాలని వారు సూచించారు. ఈ వ్యాధి మల్టీ డ్రగ్స్ తెరపితో పూర్తిగా నయమవుతుందన్నారు. మురికివాడలు, బస్తీల్లో నివసించే స్థానిక ప్రజలు కాలి, చేతుల్లో తిమ్మిర్లు వచ్చినా, కాళ్లకు చెప్పులు ఊడిపోయినా స్పర్శ లేకున్నా.. వెంటనే స్థానికంగా ఉన్న బస్తీ దవాఖానాలు లేదా వివిధ ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చన్నారు. గత నెల 30 న గాంధీ వర్ధంతి రోజున ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకు ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీజేపీ నేతలు వెంకటేష్ కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎంపీ మహేందర్‌బాబు, వివిధ ఆస్పత్రులకు చెందిన డాక్టర్లు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీల అభ్యున్నతికి కృషి



ఆనంద్‌గౌడ్‌ను సత్కరిస్తున్న బాగ్ అంబర్‌పేట బీజేపీ నేతలు

అంబర్‌పేట్: ఓబీసీల హక్కుల కోసం తనవంతు పాటుపడతానని బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్ తెలిపారు. శనివారం అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లోని ఆయన నివాసంలో బాగ్ అంబర్‌పేటకు చెందిన బీజేపీ నేతలు ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టడాన్ని పురస్కరించుకుని ఆనంద్‌గౌడ్‌ను సత్కరించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. ఓబీసీలకు అన్ని విధాలా అండగా ఉంటానన్నారు. బీజేపీ నాయకులు చుక్క జగన్, దత్తు సురేష్ తదితరులున్నారు.

ఆటపాటలతో మనో వికాసం



క్రీడోత్సవాలలో పాల్గొన్న కరస్పాండెంట్ సరోజావివేక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులకు ఆటపాటలతోనే మనో వికాసం లభిస్తుందని అంబేడ్కర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ సరోజవివేక్ అన్నారు. శనివారం అంబేడ్కర్ కళాశాలలో క్రీడా వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజావివేక్ మాట్లాడుతూ.. నిరంతరం యాంత్రిక జీవనంలో మానసిక ఒత్తిడిని తట్టుకోవడానికి క్రీడలే దోహదం చేస్తాయన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుఢ్యానికి దోహదపడతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్యారమ్స్, చెస్ తదితర క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను ఆమె అభినందించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్స్, ప్రిన్సిపాల్, పీఈటీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ఈనెల 13 న నల్గొండలో బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భారీ బహిరంగ సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్దామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని మీటింగ్‌హాల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ బహిరంగ సభకు మాజీ సీఎం కేసీఆర్ హాజరవుతున్నారని కృష్ణా జలాల పంపకాలపై కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై పలు అబద్ధపు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఆ ఆరోపణలకు బహిరంగ సభలో ధీటైన జవాబు సీఎం కేసీఆర్ ఇస్తారన్నారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, మహ్మద్ జహంగీర్, ముఠా నరేష్, వివిధ డివిజన్‌ల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్, మధు, ముదిగొండ మురళీ తదితరులు పాల్గొన్నారు.

విద్యావాలంటీర్ల వేతనాలు చెల్లించాలని వినతి

కాచిగూడ: విద్యావాలంటీర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని బీసీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నీల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా వాలంటీర్లకు 2019 నుంచి 2020 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వారి జీతాలు చెల్లించి, వాలంటీర్లను రెన్యూవల్ చేయాలని కోరుతూ.. ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి వినతిపత్రం అందించామన్నారు.

మహాగతే చారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహాగతే పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ 8వ వార్షికోత్సవం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శనివారం ప్రముఖ రచయిత అమిగనత్ర రచించిన 'మహాభారత్ అన్ రావేల్డ్ టూ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహాగతే చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మహాముని శ్రితమహాగత మాట్లాడుతూ.. పేదలు, అనాధలకు తమ ట్రస్టు ద్వారా వివిధ రకాల సేవలు అందిస్తున్నామన్నారు. యువత చేతన, బాల చేతనలను ఏర్పాటు చేసి వారికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి సాయికుమార్, కన్వీనర్ పవన్ వల్లూరి, సంధ్య, సౌత్ హెడ్ ఇందిర పల్లవి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి

చిక్కడపల్లి: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా గాంధీనగర్ డివిజన్ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం గాంధీనగర్‌లోని కార్పొరేటర్ క్యాంప్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డిప్యూటీ ఇంజినీర్ గీత, అసిస్టెంట్ ఇంజినీర్ అబ్దుల్ సలామ్‌లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులు ప్రారంభమై పెండింగ్‌లో ఉన్న పనులు, నిధులు మంజూరై ఇంకా ప్రారంభం కాని తదితర పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పనులు త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బీజేవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అంబర్‌పేట్: అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. శనివారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని ఓ భవనాన్ని అనుమతులకు మించి ఆదనపు అంతస్తు నిర్మించడంతో టౌన్ ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ వీరస్వామి ఆధ్వర్యంలో శనివారం అక్రమనిర్మాణాలను కూల్చి వేశారు. ఏసీపీ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలను సహించేది లేదని ఆయన అన్నారు.